# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 29 జనవరి 2023


## కర్బూజ...అమ్మకాలు జోరు

రామసముద్రం, జనవరి 28 ప్రభాతవార్త :



వేసవి రాకమునుపే కర్బూజ కాయలు అమ్మకాలు జోరందుకొన్నాయి. రామసముద్రం బస్టాండు ప్రధాన కూడలి అయిన బెంగుళూరు రోడ్డు, టిటిడికళ్యాణ మండపం రోడ్డు, బస్టాండు సర్కిల్ కూడలి ప్రాంతాల్లో కర్బూజ కాయలను స్థానిక వ్యాపారులు అమ్మకానికి ఉంచారు. జిల్లా, మండల, కర్నాటక రాష్ట్రంలో రైతులు సాగుచేసిన కర్బూజలను ఇక్కడి వ్యాపారులు తీసుకువచ్చి బస్టాండుప్రాంతంలో అమ్మకానికి ఉంచుతున్నారు. కేజి ధర రూ.20నుండి 30వరకు అమ్ముతున్నారు. ఒకొక్కకాయ బరువు సుమారు 5నుంచి 15కేజీల వరకు ఉన్నాయి. ఎంతో నాణ్యతగా, రుచికరంగా ఉండడంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు. ఈ కర్బుజ కాయలు జూన్ వరకు అందుబాటులో ఉంటాయి. వేసవిలో వీటిని తినడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ఆర్‌జెడి

రాయచోటి.జనవరి28 ప్రభాతవార్త

ఏప్రిల్‌లో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రదానోపాద్యాయులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బండ్లపల్లి ప్రతాపరెడ్డి సూచించారు. శనివారం ఉదయం రాయచోటిలోని లయ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్స్ ప్రిన్సిపల్‌లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ, బి, సి గ్రూపులుగా విభజించాలన్నారు. సి గ్రూపులోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరించాలన్నారు. అనంతరం డిఈవో రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలను సంబందించి పాఠ్యప్రణాళిక, టీచింగ్ డైరీని కలిగి ఉండాలన్నారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్ష పత్రాలను దిద్ది పర్సనల్ మార్క్స్ రిజిస్టర్ లో వెంటనే నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లి, ఉప విద్యాశాఖ అధికారులు వరలక్ష్మి, క్రిష్ణప్ప, జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజిబివి, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసి వెల్ఫేర్ పాఠశాలల ప్రధానోపాదా ్యయులు, ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# వైభవంగా రథోత్సవం

### భారీగా హాజరైన భక్తజనం





కడప, జనవరి 28, ప్రభాతవార్త:

దేవుని కడప వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. టీటీడీ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 7 గంటలకే భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వార్లను దర్శించుకొనేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. రథోత్సవంలో అడుగడుగునా భక్తులకు అన్నదానం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. టీటీడీ అధికారులు రథోత్సవంలో భక్తులకు ఎలాంటి ఆటం కాలు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు.

# కూలీలు దొరకక రైతుల అవస్థలు

దువ్వూరు, జనవరి 28, ప్రభాతవార్త:



మండల పరిధిలో వివిధ రకాల పంటల నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నందున కూలీలు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము, మొక్కజొన్న, జొన్న, కేపీ ఉల్లి పంటను పొలం నుంచి తీసేందుకు సిద్ధమవుతున్నారు. అక్కడక్కడ శనగ పంట నూర్పిళ్లు కూడా జరుగుతు న్నా యి. వారం రోజులుగా మండలంలో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక వైపు కేపీ ఉల్లి పంట తీసేందుకు, కోసేందుకు మినుము పంట నూర్పిళ్లకు మహిళా కూలీలు అవసరం ఉంటుంది. ఈ రెండు పంటలు ప్రస్తుతం నూర్పిళ్ల దశలో ఉండడంతో కూలీల డిమాండ్ ఏర్పడింది. కేపీ ఉల్లిని కోసేందుకు మహిళా కూలీకి రూ.250 నుంచి రూ.300



వరకు చెల్లిస్తున్నా కూలీలు రావడం లేదని రైతులు వాపో తున్నారు. మినుము పంటకు కూడా కూలీలు దొరక్క పంట పొలం ముందే ఎండిపోతోంది. జొన్న, మొక్క జొన్న కూడా వాటికి కూడా కూలీలు దొరకడం లేదు. మరికొంత మంది కూలీలు రాజుపాలెం మండలానికి శనగ పంట నూర్పిళ్లకు వెళ్తున్నారు. అక్కడ ఎక్కువ కూలీ డబ్బులు వస్తున్నట్లు తెలియడంతో ఆ ప్రాంతం వైపు మొగ్గు చూపుతున్నారు. మినుము పంటకు కూలీలు దొరక్క రైతులు ఎదురు చూస్తు న్నారు. ఒక్కొక్కరికి రూ.300 కూడా చెల్లించేందుకు సిద్ధమవుతున్నా కూలీలులు రావడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బం ది పనులకు రావాలని జాబ్‌కార్డుల వారిని కోరు తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉన్నందున ఉపాధి పనులు ఆపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయి లో పనిచేస్తున్న సిబ్బంది తమకు పై అధికారులపై ఒత్తిడి ఉందని ఉపాధి పనులు చేయించాలని కూలీలపై ఒత్తిడి తెస్తున్నారు. ఒకవైపు వ్యవసాయ పనులు ముమ్మ రంగా జరుగుతుంటే ప్రభుత్వం ఉపాధి పనులు చేపట్టాలని ఆదే శాలు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనా ఉపాధి హామీ పనులు కొద్దిరోజులు వాయిదా వేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

# మహిళా సాధికారికతకు పెద్దపీట

### గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

కడప జనవరి 28, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళా సాధికారతకు పెద్ద పీఠ వేసి ప్రతి గడప గడపకువెళ్లి సంక్షేమ పథకాలను అందించడం జరుగు తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. శనివారం నగ రంలోని 42/4 వ డివిజన్ రవీంద్ర నగర్ సచివాలయం-4 పరిధిలో కార్పొరేటర్ చల్లా స్వప్న, ఇంచార్జి చల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభు త్వం కార్య క్రమాన్ని అంజాద్ బాషా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ప్రజలు పొందుతున్న లబ్ది సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి సంతకం చేసిన బుక్‌లెట్‌ను అంద జేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీల కతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షే మ పథకాలను అందించిన ఏకైక ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్య క్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు కార్పొరేటర్ చల్లా స్వప్న, ఇంచార్జి చల్లా రాజశేఖర్, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, డైరెక్టర్ బంగారు నాగ య్య యాదవ్, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్‌షఫీ, బాలస్వామిరెడ్డి, సూర్య నారాయణరావు, రెడ్డి ప్రసాద్, వైకాపా యువనాయకులు ఉమైర్, వైకాపా నాయ కులు అఫ్జల్‌ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్‌ఆర్‌ఐ తోట కృష్ణ, తుమ్మలకుంట శివశంకర్, షఫీ ఉల్లాహ్, అహమ్మద్, ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, సచివా లయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

### డ్వామా అధికారులు, ఫీల్డు సిబ్బంది సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయరామరాజు






కడప, జనవరి 28: ఉపాధి హామీ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభాభవన్ లో.. జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై.. డ్వామా పీడి యదుభూషన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు.. ఎపిడీలు, టెక్నీకల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు మాట్లా డుతూ.. ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న ఎన్ఆర్ఈజిఎస్ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా.. జిల్లాలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా సంపూర్తి చేయాలన్నారు. అన్ని మండ లాల్లో కూలీల పని దినాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్ ఈజిస్ పరిధిలో జరిగే అన్ని పనులను.. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి స్టేజీ కన్వర్షన్ ప్రక్రియలో మరింత పురోగతి సాధించాలన్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా.. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎక్కడా కూడా అలసత్వం, తాత్సారం లేకుండా లక్ష్యం మేరకు గడువులోగా పూర్తి చేయాలని హెచ్చరించారు. కూలీలకు సంబంధించి యాక్టివ్ జాబ్ కార్డుల ఆధార్ సీడింగ్ ప్రక్రియను ఎక్కడా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్.ఆర్.ఎం., వ్యవసాయ అనుబంధ పనుల నిర్వహణకు సంబంధించి పనులను వేగవంతం చేసుకోవాలని, లేబర్ కంపోనెంట్, లేబర్ మోబిలైజేషన్ ఏ మాత్రం తగ్గకూడదని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో డ్వామా ఏ.పి.డి.లు, పివోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కుల, ఆదాయ దృవీకరణ పత్రాలు నిర్ణీత కాలంలో జారీ చేయాలి

### సచివాలయ సిబ్బందికి ఆదేశించిన కలెక్టర్ గిరీషా పిఎస్

### సచివాలయాల్లో ప్రజల నుంచి సర్వీస్ రిక్వెస్ట్‌లు పెరగాలి

### ప్రభుత్వ సేవలను ప్రజలకు నిర్దేశించిన సమయంలో అందించాలి



రాయచోటి.జనవరి28 ప్రభాతవార్త

కుల, ఆదాయ దృవీకరణ పత్రాలు నిర్ణీత కాలంలో జారీ చేయాలని కలెక్టర్ గిరీషా పిఎస్ సచివాలయం సిబ్బందికి ఆదేశించారు. శనివారం మద్యాహ్నం రాయచోటి మండలం, చెన్నముక్కపల్లి-2 గ్రామ సచివాలయంను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రగతి నివేదికలను, హాజరు పట్టీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజల నుంచి సర్వీస్ రిక్వెస్ట్‌లు పెరిగేలా చూడాలని, అన్ని రకాల సేవలు సులభతర రీతిలో అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వాలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి ఇక్కడ అందే సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత కాలంలో జారీ చేయా లని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సచివా లయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాని, ప్రజల నుంచి అందిన అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రతి రోజు ఎని న్న అర్జీలు వస్తున్నాయి, వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ పౌర సేవలను విస్తృతంగా అమలు చేసి ప్రజలు నుంచి అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట రాయచోటి తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించండి : ఎస్‌పి అన్బురాజన్

కడప క్రైం, జనవరి 28, ప్రభాతవార్త:



హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్పీ తెలిపారు. శనివారం పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌పై పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లు, జీపులు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని తెలిపారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రతపై స్టిక్కర్లు, పోస్టర్లు ముద్రించి పట్టణాలతో పాటు గ్రామాల్లో అతికిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమా దం జరగకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి భద్రతా వారోత్సవాల నేపథ్యంలో అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పోలీ సులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబందనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం కేసులు 278 నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 256 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, ఇతర వాహనాల చోదకులు 22 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

# కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలి

### -నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి.జనవరి28 ప్రభాతవార్త



జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పలు కేసులను దర్యాపు_ వేగవంతంగా చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. శనివారం రాయ చోటి జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ రహదారి భద్రతలో భాగంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనా లను తనిఖీ చేయాలని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్స్ కలిగి ఉండాలని మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేసి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే నాన్ బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్ గల కారణాలు తెలుసుకుని సబ్ డివిజన్ పరిధిలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిల్‌బుల్ వారెంట్స్‌ను త్వరితగతిన ఎగ్జిక్యూటివ్ చేయా లని ఎస్పీ ఆదేశించారు. చీటింగ్ కేసులకు సంబందించిన ప్రతి కేసు ఫైల్‌ను స్వయంగా ఎస్పీ పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న మర్డర్ కేసులు రేప్ కేసులు ఫోక్సో కేసులు ప్రాపర్టీ కేసులు చీటింగ్ కేసులు మిస్సింగ్ కేసులు పెండింగ్ నాన్‌బెయి లబుల్ వారెంట్ రోడ్డు ప్రమాదాలు ఈ చలానా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఎన్ఫోర్స్‌మెంట్ స్పందన పిటీషన్ల పై డిపిఓ పెండింగ్ రిప్లై ఫైల్స్ పైన ఎస్పీ సమీక్షించారు. పిఓసిఎస్ఓఎన్‌డిపి ఎస్ కేసులు దర్యాప్తు సమయంలో సాధారణంగా జరిగే పొరపాట్లు తీసుకోవాల్సి న జాగ్రత్తలు ఎస్పీ వివరించారు. కేసులు దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా సంబందిత కోర్టులో చార్జిసీట్ దాఖలు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే ప్రాపర్టీ కేసు విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రాపర్టీ కేసులను చేధించి బాధితులు నష్టపోయిన సొమ్మును రికవరీ చేసి వారికి న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో సిఆర్‌పిఎస్ మహిళా కానిస్టేబుల్ మృతి

మదనపల్లెక్రైం, జనవరి 28 ప్రభాతవార్త :



రోడ్డు ప్రమాదంలో సిఆర్‌పిఎస్ మహిళా కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె రూరల్ మండలం కొత్త వారి పల్లె పంచాయితీ ఆర్‌సి వడ్డిపల్లెకు చెందిన రవీంద్ర ఆర్మీలో పని చేస్తుండగా, భార్య అరుణాదేవి 41 పశ్చిమ బెంగాల్‌లో సిఆర్‌పిఎస్ కానిస్టేబుల్‌గా ఉన్నారు. వీరి కుమారుడు హర్షవర్ధన్ ఆర్‌సి వడ్డెపల్లెలోని అవ్వ తాతల వద్ద ఉంటూ 6వ తరగతి చదువుకుంటున్నాడు. సంక్రాంతి సెలవులకు విజయవాడలోని అనంతపల్లి ఉన్న అమ్మమ్మ, తాతయ్యల వద్దకు వెళ్లారు. అయితే శనివారం అరుణాదేవి పశ్చిమ బెంగాల్‌కి వెళ్ళాల్సి ఉండడంతో శుక్ర వారం కుమారున్ని తీసుకొని మదనపల్లెకు వచ్చి ఆటో తీసుకొని తన అత్తమామల వద్ద వదలి తిరిగి ఆటోలో మదనపల్లె బస్టాండుకు బయలుదేరారు. మార్గమధ్య లో తురకపల్లె సమీపాన ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ఆటో ముం దు వెలుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణ దేవిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు చేస్తుండ గానే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకొన్న తాలూకా పోలీసులు సంఘ టనకు చేరుకొని పరిశీలించారు. అరుణదేవి మృతిచెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియ జేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆక్రమణ భూములపై రెవెన్యూశాఖ దాడులు

### ఆక్రమణలు తొలగిస్తుండగా పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

పుల్లంపేట, జనవరి 28 ప్రభాతవార్త



పుల్లంపేట మండలం తిప్పాయపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో ప్రభుత్వ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిపై దాడులు నిర్వహించి చుట్టూ ఉన్న కంచెను తొలగించిన సంఘటనకు సంబంధించిన విషయం ఇది. ఈ సంఘటన లో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఆక్రమణదారుడు రెవె న్యూ అధికారులను బెదిరిస్తూ పురుగు మందులు తాగడా నికి ప్రయత్నం చేయడంతో పోలీసులు నివారించి ఆసుపత్రి కి తరలించారు. వివరాల్లోకి వెళితే పుల్లంపేట మండలం తిప్పాయపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనంబరు 619 పరి సర ప్రాంతాల్లోని భూమిని రాజంపేట మండలం వర దయ్య గారిపల్లెకు చెందిన సర్పంచ్ శ్రీహరి ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించడానికి తమ సిబ్బంది తో శనివారం వెళ్లారు. వారితో పాటు పుల్లంపేట పోలీసులను కూడ తీసుకెళ్లారు. మండల తహశీల్దారు కుమార్ తమ సిబ్బందితో ఈ ఆక్రమణలు తొలగిస్తుండగా శ్రీహరి పురుగుమందులు తాగేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు వారించేందుకు ప్రయత్నించే లోపు శ్రీహరి మందు తాగేశాడు. వెంటనే పోలీసులు అతన్ని రాజంపేట ఆసుపత్రికి తరలించి తాత్కాలిక ఆక్రమణకు గురైన భూమిలో కొంత ఆక్రమణలు తొలగించి రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. ఈ విషయంలో శ్రీహరితో పాటు పలువురు ఉన్నారు. వారందరి ఆక్రమణలు అన్ని తొలగిం చండని రెవెన్యూ అధికారులను కోరినట్లు సమాచారం. ఓ ప్రజాప్రతినిధిగా ఉండి ఇలాంటి ఆక్రమణలు చేయడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఆక్రమణదారులపై కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉంది.

## రైతులకు అందుబాటులోకి కృష్ణ సీడ్స్ పెస్టిసైడ్స్

కడప వైద్యవిభాగం, జనవరి 28, ప్రభాతవార్త:



కడప జిల్లా రైతులకు నాణ్యమైన సీడ్స్ పెస్టిసైడ్స్ అందించేందుకు మీగడ కృష్ణారెడ్డి, మీగడ వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయ మని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, వైకాపా నాయకులు మాసీమ బాబు తెలిపారు. శనివారం నగర శివార్లలోని తిలక్‌నగర్ బైపాస్‌లో కృష్ణ సీడ్స్ పెస్టిసైడ్స్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను, రసాయన మందులు అందించి మంచి పేరు సంపాదించుకోవాలని వారు సూచించారు. అనంతరం కృష్ణ సీడ్స్ ప్రొప్రైటర్లు మీగడ కృష్ణారెడ్డి, మీగడ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ మా వద్ద ప్రభుత్వం అమోదించబడిన మందులు లభిస్తాయన్నారు. కంపెనీ ప్రతినిధులు రైతులకు సిఫారసు చేసిన మందులను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఇండోఫీల్ కంపెనీ మార్కెట్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి, బాయర్ టీఎస్‌ఎం కంపెనీల అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇండోఫీల్ టీఎస్‌ఎం రమణారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

జమ్మలమడుగు, జనవరి 28, ప్రభాతవార్త:



ఫిబ్రవరి 1న పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. 2023-24 విద్యా సంవత్సరంకు బడ్జెట్ అధిక నిధులు కేటాయించా లన్నారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు, స్కాలర్‌షిప్‌లు, ఎస్సీ, ఎస్టీ బీసీ రంగాలకు అధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మల మడుగు పీడీఎస్‌యూ నాయకులు చైతన్య, మనోజ్, నరహరి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## యువగళంలో 2వ రోజు..

జమ్మలమడుగు, జనవరి 28, ప్రభాతవార్త:



తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రారంభించిన యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం 2వ రోజు జమ్ములమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్‌తో చేయి చేయి కలిపి పాదయాత్రలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాదయాత్రకు తెదేపా నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు జననీరాజనం పలుకుతున్నారు.

## దేవుని కడపలో అన్నదానం

కడప వైద్యవిభాగం, జనవరి 28, ప్రభాతవార్త:



దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రథోత్సవం పురస్కరించుకొని భక్తులకు ఉక్కాయపల్లి రాజా ఆధ్వర్యంలో దేవుని కడప టీటీడీ కల్యాణ మండపంలో పెద్దఎత్తున అన్నదానం ఉదయం నుంచి సాయంత్రం వరకు చేశారు. ఈ సందర్భంగా ఉక్కాయపల్లి రాజా మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవం రోజు ప్రతి సంవత్సరం భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. గత 36 సంవత్సరాలుగా వేలాది మంది భక్తులకు అన్నదానం చేయడం జరుగుతోందన్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆశీర్వాదంతో దేవుని సన్నిధిలో అన్నదానం చేయడం ఎంతో వరంగా భావిస్తున్నా మని తెలిపారు. ఉక్కాయపల్లి రాజా మిత్ర బృందం పాల్గొన్నారు.

## హజ్ కమిటీ చైర్మన్ జనాబ్‌గౌస్ లాజంకు వినతి పత్రం

కడప వైద్యవిభాగం, జనవరి 28, ప్రభాతవార్త:



కడప నగరం ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ బి.ఎస్.గౌస్‌లాజం స్వగృహంలో కడప హజ్ హౌస్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం కలిసి హజ్ హౌస్ పున: ప్రారంభించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ హౌస్ పున: ప్రారంభానికి కొన్ని సాంకేతిక, న్యాయపరమైన సమస్యలున్నాయని వాటన్నింటినీ త్వరగా పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేసి హజ్ భవన్‌ను పున: ప్రారంభించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సంఘ సేవకులు సలావుద్దీన్, కోకన్వీనర్లు మహ్మద్ అలీఖాన్ (లీగల్ అడ్వైజర్) తన్వీర్ అహ్మద్, జమీల్, ఇసాఖ్ మాల్వీ సాబ్, రఫీక్‌ఖాన్, జహీరుద్దీన్, షబ్బీర్ పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లకు, దొంగలకు నిలయం

– తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ

కడప వైద్యవిభాగం, జనవరి 28, ప్రభాతవార్త:



వైఎస్ఆర్ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లకు, దొంగలకు, మహిళలను వేధించే వారికి నిలయంగా మారిందని అటువంటి వారికి అధిష్టానం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పదవులను కట్టబెడు తున్నారని వాటితో వారు చెలరేగి పోతున్నారని ఏపీ పరువును పోగొడుతున్నా రని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తెలిపారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వంలో దొంగ నోట్ల ముఠా వారికి, అక్రమ మద్యం నేరగాళ్లు చెలరేగి పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగనోట్ల ముఠా కేసులో రజనీతో పాటు ఎవరెవరున్నారో కొన్ని కోట్ల నకిలీ దొంగ నోట్లు చేతులు మారాయో దీని సూత్రధారి ఎవరో నిగ్గు తేల్చి ప్రతి ఒక్కరికి శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, 22వ డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, అనిల్ పాల్గొన్నారు.

## కడప - బెంగళూరు రైల్వే మార్గాన్ని ప్రారంభించాలి : ఆర్‌సిపి

కడప ఏడురోడ్లు, జనవరి 28, ప్రభాతవార్త:




వచ్చే కేంద్ర బడ్జెట్‌లో రాయల సీమలోని రైల్వే మార్గాలకు అత్యధికంగా నిధులు కేటాయించి కడప–బెంగళూరు రైలు మార్గాన్ని పూర్తి చేసి విధంగా కేంద్రంపై రాయలసీమలో ఉన్న ఎంపీలు ఒత్తిడి తీసుకు రావాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి శనివారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కడప జిల్లా కేంద్రమైన కడపలో హాంసఫర్ రైలును కడపలో ఆపకపోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమలో కొత్త రైల్వే ప్రాజెక్టులు ఇవ్వాలన్నారు. కడప విజయవాడకు వెళ్లే అందుకు రోజూ ఉదయం సాయంత్రం రైలును నడపాలన్నారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య కడప నెల్లూరు విజయవాడకు రైలు మార్గాన్ని తయారు చేసి ఇచ్చారని దాన్ని ఇంత వరకు సర్వేలతోని సరిపెడుతున్నారని ఈ మార్గాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సిపి రాష్ట్ర నాయకులు లింగమూర్తి, షేక్ మగ్బూల్ బాషా, ఆంజనేయులు, అక్బర్ పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి యాన్యువల్ ఫైరింగ్

కడప క్రైం, జనవరి 28, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఏఆర్ మొబిలైజేషన్‌లో భాగంగా శనివారం సిబ్బందికి యాన్యువల్ ఫైరింగ్ నిర్వహించారు. నగర శివార్లలోని రాజీవ్ స్మృతి వనం వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ సిబ్బందికి ఏఆర్ పోలీసు అధికారులు ఫైరింగ్‌లో మెళకువలు వివరించారు. ఏఆర్ డీఎస్పీ రమణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పోలీసు పరేడ్ మైదానంలో తుపాకీని ఎలా ఉపయోగించాలి, తుపాకి నిర్వహణ, ఎస్ఎల్ఆర్ తుపాకీతో డ్రిల్ నిర్వహణపై ఏఆర్ పోలీసు ఉన్నతాధికారులు మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## భాష్యం విద్యా సంస్థల్లో స్పోర్ట్స్ మీట్

కడప ఎడ్యుకేషన్, జనవరి 28, ప్రభాతవార్త:



భాష్యం విద్యా సంస్థలలో స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహిస్తున్నారు. కడప జోన్ భాష్యం విద్యా సంస్థలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా సంప్రదాయ నృత్య ప్రదర్శనతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో కడప జోన్ జోనల్ ఇన్‌ఛార్జి రామకృష్ణ పాల్గొని క్రీడల గురించి మాట్లాడుతూ క్రీడలు పిల్లలకు ఆనందాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి,కార్పొరేటర్ గంగరాజు యాదవ్ డీఎస్ఏ చీఫ్ కోచ్ అమృతరాజ్ పాల్గొని పిల్లలకు క్రీడలు అవసరమని భవిష్యత్తు లో ఉన్నత స్థానాలను చేరుకోవడానికి విద్యార్థులకు క్రీడలు ఒక భాగమని తెలిపారు. మైదానంలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, చెస్, క్యారమ్స్, 100 మీటర్ల రన్నింగ్, 400మీటర్ల రిలే, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలింగ్ త్రో, టెన్నీ కాయిట్, డాస్ట్ బాల్ ఆటలను నిర్వహించి విజేతలకు ఆ సంస్థలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు జోనల్ ఇన్‌ఛార్జిల చేతుల మీదుగా బహు మతులు ప్రదానం చేశారు.

## ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శిగా జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్, జనవరి 28, ప్రభాతవార్త:

అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శిగా కడపకు చెందిన జయవర్ధన్ ఎన్నికయ్యారు. ఈనెల 25, 26 తేదీల్లో కాకినాడలో జరిగిన ఏఐఎఫ్‌బీ ద్వితీయ మహాసభలలో జయవర్ధన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో నన్ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఏఐఎఫ్‌బీ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందర్ రామరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భూమికి ఆధారం గోమాత

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 28, ప్రభాతవార్త:



ప్రపంచానికి ఆహారం ఇవ్వాలంటే భూమే ఆధారమని అలాంటి భూమి నేడు నిస్సారమై మనిషికి కావాల్సిన పోషకాహారం దొరకడం లేదు. గో సేవ ద్వారానే అది సాధ్యమవుతుందని సమర్ధ నారాయణ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీ ప్రభు మహారాజ్ అన్నారు. శనివారం స్థానిక ఉప్పరపల్లె ఆశ్రమానికి చేరుకున్న ఆయన గో సేవ గురించి వ్యాఖ్యానించారు. పూర్వం ఎద్దులతో సేద్యం చేసే వారని యాంత్రీకరణ పేరుతో నేడు ట్రాక్టర్లతో చేస్తున్నారని ప్రతి ఇంట్లో 5 నుంచి వంద ఆవులు ఉండేవని ఆ ఆవులు విసర్జిన మలమూత్రాలతో భూమి సారవంతమై మంచి పంట ఇచ్చేదని దీని వల్ల ఆరోగ్య భారతిగా వెలుగుతుండేదన్నారు. గోవుపాలు ఆరోగ్య ప్రదాయిని అని షుగర్, బీపీ, కొలస్ట్రాల్ తగ్గించడమే కాకుండా మంచి తెలివి తేటలు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉమాదేవి పాల్గొన్నారు.

## విద్యార్థికి సాధనే మొదటి ఆయుధం

కడప ఎడ్యుకేషన్, జనవరి 28, ప్రభాతవార్త:

విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి దేశానికి ఆదర్శమని పాఠశాల ప్రాంతీయ సంచాలకులు జోన్–4 (ఆర్జేడీ) డా.బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని జిల్లా పరి షత్ సమావేశ మందిరంలో వైసీపీ మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు సమీక్ష సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అనుకుంటే సాధించలేనిది లేదన్నారు. మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, యూరినల్స్, తరగతి గదులు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాఠశా లను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి చెప్పలి దేవరాజు, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబ వరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజ గోపాల్‌రెడ్డి, డీసీఏబీ సెక్రటరీ శోభారాణి, ఆర్ఐపీఈ భానుమూర్తిరాజు, పరీక్షలు విభాగం వెంకటేష్, కడప, సి.కె.దిన్నె, కమలాపురం ఎంఈఓలు పాలెం నారాయణ, వెంకటరామిరెడ్డి, జాఫర్ సాదిక్, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరీలు, అధికారులు పాల్గొన్నారు.

## 5 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

కడప ఏడురోడ్లు, జనవరి 28, ప్రభాతవార్త:

స్థానిక రవీంద్రనగర్‌లో రెండు శతాబ్దాలుగా వెలసి ఉన్న హజరత్ సయ్యద్ షా గౌస్ వర్మద్ ఖాద్రి 184వ ఉరుసు ఉత్సవాలు ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం గంధోత్సవంతో ప్రారంభం కానున్నాయని పీఠాధిపతి సయ్యద్ షా ఇలియాస్ బాషా ఖాద్రి అన్నారు. 6వ తేదీ సోమవారం ఉరుసు 7వ తేదీ మంగళవారం తహలీల్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ముస్లిం సోదరులు ఇతర ఆస్తానాల పీఠాధిపతులు, ఇమాంలు, ఖతీబ్‌లు, పుర ప్రముఖులు అందరూ పాల్గొని వారి కృపను పొందాలని పిలుపునిచ్చారు.

## ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్‌ను కలిసిన సుభాన్‌బాషా

కడప ఏడురోడ్లు, జనవరి 28, ప్రభాతవార్త:



భువనేశ్వర్‌లో ధ్యాన్‌చంద్ హాకీ ఇండియా జనరల్ సెక్రటరీ భోలానాథ్ సింగ్, మాజీ హాకీ ఇండియా బోర్డు మెంబర్లను స్వస్తిక్ ప్లాజా బోర్డు మీటింగ్‌లో కడప హాకీ అకాడమీ డైరెక్టర్ సుభాన్ బాషా కలిసి చాలా గొప్పగా వరల్డ్ కప్ నిర్వహించారని అభినందించారు. హాకీ అభివృద్ధికి మీరు చేస్తున్న కృషి తీసుకుంటున్న నిర్ణయాలు చాలా గొప్పవి అని అన్నారు. పూర్వ హాకీ క్రీడను తిరిగి గాడి లో పెట్టి ఇండియాకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్య క్రమంలో కార్పొరేటర్లు గౌస్‌బాషా, అలీ అక్బర్, సంషీర్ పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలు తక్షణం భర్తీ చేయాలి

– సీఎంకు సీపీఐ నేత ఈశ్వరయ్య బహిరంగ లేఖ

కడప ఏడురోడ్లు, జనవరి 28, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫేక్ జీవో వెనక ప్రభుత్వ హస్తం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య ఆరోపించారు. శనివారం ముఖ్యమంత్రి జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, అటు నిరుద్యోగుల్లో ఆందోళన రేకెత్తించేందుకు సోషల్ మీడియాలో అసత్య ప్రచారా లకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు సకాలంలో జీతం చెల్లించలేని ప్రభుత్వం సమస్యను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి కుటిల ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఉన్నత విద్యాశాఖలో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపదవీ విరమణ వయసు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఫేక్ జీవోలు పుట్టుకొస్తున్నట్లు ఆరోపించారు.

## పవన్, లోకేష్‌లవి స్వార్థపూరిత యాత్రలే : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు జనవరి 28, ప్రభాతవార్త



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ల వారాహి రథ యాత్ర లు కేవలం స్వార్థం కోసంతో కూడినవేనని ప్రజా సంక్షేమం కోసం కాదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ ఛాంబర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ లోకేష్ స్వార్థపూరిత యాత్రలపై విరుచుకుపడ్డారు. లోకేష్ పాదయాత్ర చేసినంత కాలం తాను పత్రికా ప్రకటన యాత్ర కొనసాగిస్తానని వెల్లడించారు. పాదయాత్ర లో సత్యము మాట్లాడితే తప్ప అబద్ధపు ప్రచారాలను రోజు తిప్పి కొట్టడమే తన లక్ష్యమన్నారు. చంద్రబాబు కు దత్తపుత్రుడుగా పవన్ ఉత్తపుత్రుడుగా లోకేష్ అని అభివర్ణించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి మూడున్నర సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. తెలుగు భాషని ఉద్ధరించలేని లోకేష్ తెలుగు జాతిని ఉద్ధరిస్తాడా అని నిలదీశారు మంగళగిరిలో లోకేష్ గాజువాకలో పవన్ గెలవలేని ప్రబుద్ధులు 175 నియోజకవర్గాలలో టిడిపిని గెలిపించడానికి తగుదు నమ్మా అని బయలుదేరడం హాస్యాస్పదమన్నారు. వారి పాదయాత్ర ప్రొద్దుటూరు కు చేరుకునే లోగా ముగిసిపోతే దేవుడికి 1000 టెంకాయలు కొడతానని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖదీర్‌కు పదివేల ఆర్థికసాయం

రాయచోటి.జనవరి28 ప్రభాతవార్త



రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన ఖదీర్ బైక్‌పై వెళుతూ బస్సును ఢీకొన్న ప్రమాదంలో కాలు కోల్పోవడంతో శనివారం లయన్స్ క్లబ్ సభ్యుడు నిర్మల్ కుమార్ పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఖదీర్ నిరుపేద కుటుంబం కావడంతో ఆసుపత్రి ఖర్చులకు తన వంతు సహాయం చేసినట్లు నిర్మల్ కుమార్ తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ మాట్లాడుతూ తాము లయన్స్‌క్లబ్ ద్వారా దాతలను గుర్తించి వారి నుంచి ఇబ్బం దులు ఎదురొ ్కంటున్న వారికి సహాయం చేయడం లయన్స్ క్లబ్ ధ్యేయమన్నారు. ఖదీర్ కుటుంబానికి సరిపడా నిత్యవసర సరుకులను కూడా అందజేస్తా మని మహమ్మద్ తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయడం మానవసేవే మాధవ సేవ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్ చంద్ర, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్ నాయక్, శివ

## భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

రామాపురం.జనవరి28 ప్రభాతవార్త



మండలంలోని ప్రధాన దేవాలయాల్లో శనివారం రథసప్తమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ప్రధానంగా మండలంలోని బండపల్లి టోల్‌ప్లాజా సమీపంలోని కంభారాయుని కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణు దేవాలయంలో అదే కొండపై వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో రథసప్తమి వేడుకలు మాజీ మార్కెట్ చైర్మన్ ఆలయ కమిటి చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు స్వామి సన్నిదిలో ఉదయం నుంచే చెక్కభజనలు హరి నామ సంకీర్తనలు భజన బృందం ఆలపించారు. వచ్చిన భక్తాదులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. హస్తినాపురం గ్రామంలోని శివాలయంలోని మూల స్థానేశ్వర స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలకు వైభవంగా నిర్వహించారు. గువ్వలచెరువు ఘాట్‌పై ఉన్న భవాని శంకర్ ఆలయం, కల్పనాయుని చెరువులోని కల్పనాదేశ్వరుని ఆలయం, రామాపురంలోని హరిహరాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## 2వ రోజు యువగళం పాదయాత్రలో పుత్తా

కమలాపురం, జనవరి 28, ప్రభాతవార్త:



కుప్పంలో ప్రారంభమైన యువగళం పాదయాత్రలో శనివారం 2వ రోజు కూడా తెదేపా జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌తో కలిసి పాదయాత్రలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు. తనతో పాటు కమలాపురం, కడపకు చెందిన తెదేపా మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అనుచరగణం తో కలిసి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తారకరత్న ఆరోగ్య స్థితి గతులతో పాటు పలు కీలక, ఇదేం ఖర్మకు కార్యక్రమానికి ప్రజల్లో వస్తున్న స్పందన, పలు రాజకీయ అంశాలపై మాట్లాడుతూ పాదయాత్రలో పాల్గొన్నారు.

## అవార్డు పొందిన కానిస్టేబుల్ చంద్ర శేఖర్

పెండ్లిమర్రి, జనవరి 28, ప్రభాతవార్త:



పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కడప ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా అవార్డు పొందారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన విధుల్లో నిక్కచ్చిగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంలో కృషి చేస్తున్నందుకు గాను ఆయన సేవలు గుర్తించి ఈ అవార్డు రావడం జరిగింది. కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డిలు కానిస్టేబుల్‌ను అభినందించారు.

## గృహ సారథులు అంకిత భావంతో పని చేయాలి : ఎమ్మెల్యే

కమలాపురం, జనవరి 28, ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని కమలాపురం మండలానికి సంబంధించిన నల్లింగాయ పల్లె, జంబాపురం, ఎర్రగుడి పాడు, చదిపిరాళ్ల, చిన్నచెప్పలి, పెద్ద చెప్పలి సచివాలయాలకు సంబంధించిన వాలంటీర్లు, గృహ సారథులతో శనివారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నింటినీ అర్హుల ప్రతి ఒక్క ఇంటికి చేరాలన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా అర్హులకు న్యా యం జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై అవగాహన కల్పించాలని చెప్పాలంటే ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా ఉంటూ వారి ప్రతి సమస్య ను ముందుండి తీర్చాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆరు మండ లాల నాయకులు, నాయకు రాళ్లు, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

జమ్మలమడుగు, జనవరి 28, ప్రభాతవార్త:

విద్యార్థుల సంక్షేమాన్ని, సమస్యలను పట్టించుకోని ప్రభఉత్వాలకు పుట్ట గతులుండవని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జి.వలరాజు అన్నారు. కడప జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణికి అడ్డుగట్ట వేసేది విద్యార్థులే అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వ అంచనాలతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షలా చేస్తున్నారన్నారు. దేశంలో రాష్ట్రంలో నియంత పూరిత ప్రభుత్వాలకు విద్యారంగ సమస్యలు ఎత్తిచూపుతూ భవిష్యత్తు పోరాటాలకు ప్రొద్దుటూరులో జరగబోతున్న 18వ కడప జిల్లా మహాసభలు వేదిక కాబోతున్నదన్నారు. పెద్ద ఎత్తున తిరుగుబాటు జెండా ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్ములమడుగు ఉపాధ్యక్షులు లీలా కృష్ణ నాయకులు మోరంరెడ్డి ఆమోస్, మధు, శ్రీనాథ్, మోసే, సుభాష్, ఉదయ్, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిగా నరసింహులు బాధ్యతలు

ముద్దనూరు జనవరి 28, ప్రభాతవార్త



ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మి నరసింహులు శనివారం భాద్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శి గా భాద్యతలను నిర్వహించిన గురుమోహన్, పొద్దుటూరు మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గా డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు. అక్కడ గ్రామ పంచాయతీ కార్యదర్శి గా భాద్యతలను నిర్వహించే నరసింహులు, ముద్దనూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గా డిప్యూటేషన్ పై ఇక్కడి కి బదిలీ అయి వచ్చి శనివారం భాద్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

## జంతువులపై ప్రేమ.జాలి,దయ చూపాలి

రాజుపాళెం,జనవరి28,ప్రభాతవార్త.



ప్రతి ఒక్కరు జంతువులపైన ప్రేమ, జాలి, దయ చూపాలని వాటికి సమాజంలో స్థానం కల్పించి మానవులతో పాటు జీవించేలా చూడాలని తెలిపారు.మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో జంతు పక్షోత్సవాలలో భాగంగా శనివారం ఉన్నత పాఠశాలలో పశువైద్యాధికారి లక్ష్మీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సమాజంలో జంతువుల పాత్ర, మానవులకు వాటితో ఉన్న సంబంధాలు వాటికి మన ఇచ్చే స్వేచ్చను వివరించారు. జంతువు లకు అనారోగ్యం చేసినపుడు పశువైద్యం అందించుటకు ప్రభుత్వం కల్పించే సేవలను వినియోగించి వాటికి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. విద్యార్థి దశ నుండి జంతు ప్రేమను అవలంబించుకొని వాటి మనుగడను కాపాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గోన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

ముద్దనూరు జనవరి 28, ప్రభాతవార్త



ముద్దనూరు ఎంపిడిఓ వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో, ముద్దనూరు గ్రామ సచివాలయ అధికార సిబ్బంది సమా వేశం, శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ముద్దనూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం సచివాలయ అధికార సిబ్బంది సహకరించాలని కోరారు.

## ముఖ గుర్తింపు విధానం రద్దు చేయాలి : ఎఐటియుసి

ప్రొద్దుటూరు జనవరి 28, ప్రభాతవార్త



మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు ముఖ గుర్తింపు విధానం ను రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా నాయకుడు ఏసోబు డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారి ఆందోళనలలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యోసోబు మాట్లా డుతూ మున్సిపల్ కార్మికులు 99 శాతం మంది నిరక్షరాస్యులని స్మార్ట్ ఫోన్లు కొని యాప్ లు డౌన్లోడ్ చేసుకొని ప్రతి దినము నాలుగు సార్లు హాజరును వారికి వారే తీసుకోమనడం వెనక ప్రభుత్వం వేతనాలు కోతవేయాలని అలాగే గుప్తంగా ఉంచు కోవాల్సిన వివరాలను ప్రభుత్వం తెలుసుకోవాలని నియంతృత్వ పోకడలు ఏంటని ప్రశ్నించారు. తక్షణం ఈ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ నాయకులు రూబెన్ నిర్మల మాట్లాడుతూ గత సమ్మెలో పర్మినెంట్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్స్ ను ఇంత వరకు అందివ్వలేదని పర్యవసానంగా సమస్యల వలయంలో చిక్కుకున్నా మన్నా రు. పదకొండవ పిఆర్సి లో బకాయిపడ్డ ఐదు డిఏలు సత్వరం విడుదల చేయాలని జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, ఉద్యోగ కార్మికులకు జూన్ నెల నాటికి 12వ పిఆర్సిని విడుదల చేయాలని, పాత బకాయిలను సత్వరం విడుదల చేయకపోతే పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఓబులేసు చంద్రపాల్ సురేష్ మధు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు జనవరి 28, ప్రభాతవార్త



రాష్ట్ర సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు శ్రీకృష్ణ ఆలయ యాదవ సేవా సంఘం అధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో పొద్దుటూరు పట్టణంలో గత కొన్ని నెలలుగా అన్న దాన కార్యక్రమాన్ని కొనసాగి స్తున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా శనివారం స్థానిక పాతబస్టాండు సమీపంలో రథసప్తమి సందర్భంగా చల్లా రాజగోపాల్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కడుపునిండా రుచి కల భోజనం పెడుతున్న చల్లా రాజగోపాల్ అభినందనీయులన్నారు భవిష్యత్తులో మరింత సేవా కార్య క్రమాలు చేపట్టేందుకు భగవంతుడు ఆయనకు శక్తిని ఆయురారోగ్య ఐశ్వర్యాలను కలిగించాలని వారు ఆకాంక్షించారు కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ తొగట విర్రక్షత్రియా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చౌడం రవి, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాసులు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు రామచంద్రరాజు జయచంద్ర, రామయ్యగౌడ్, భాస్కర్ గౌడ్, ప్రసాద్, శివ, రమణ పాల్గొన్నారు.

## కన్నుల పండువగా రథసప్తమి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 28, ప్రభాతవార్త



మాఘశుద్ద సప్తమి నాడు ఎంతో భక్తిశ్రద్దలతో నిర్వహించే రథ సప్తమి పర్వదినం శనివారం ప్రొద్దుటూరు పట్టణం లోని అన్ని వైష్ణవాలయాలలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత మార్కెట్ లో వున్న శ్రీమహా లక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో, లలితా దేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో, ఆత్మా రామస్వామి దేవస్థానంలో ప్రాత:కాలం నుండే గోక్షీర, పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, మహా నివేదనం, మహా మంగళహారతి నిర్వహిం చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో రథో త్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

## 2024లోపు సీపీఎస్‌పై మంచి నిర్ణయం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



2024 సాధారణ ఎన్నికల లోపు సీపీఎస్‌పై సీఎం జగన్ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన ప్రకటన చేస్తారని పీఆర్సీ, డీఏలపై కూడా స్పష్టంగా మంచి నిర్ణయంతో కూడిన ప్రకటన తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారని పశ్చిమ రాయలసీమ వైసీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశంలో సిబ్బందిని, ప్రజా ప్రతినిధులను, గ్రాడ్యుయేట్లను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని వైసీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి అభ్యర్థించారు. జడ్పీటీసీ రమాదేవి, వైసీపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి గూటం రాము, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధార్ లింకును వేగవంతం చేయండి

ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, జనవరి 28 ప్రభాతవార్త:



ప్రతి ఓటర్ జాబితా ప్రకారం ప్రతి ఓటుకు ఆధార్‌లింకు కార్యక్రమం వేగవంతం చేయాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. శనివారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో మదనపల్లె అర్బన్, రూరల్, మండలాలకు చెందిన బిఎల్‌ఓలతో ఆధార్ లింకుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లాలో ఓటుకు ఆధార్‌లింకు కార్యక్రమంలో వెనుకబడి ఉన్నామని ముందుంజులో ఉండేలా బిఎల్‌ఓలు చొరవ చూపాలన్నారు. ఆధార్‌లింకు చేసే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అర్బన్‌లో కూడా బిఎల్‌ఓలు నిర్లక్ష్యం వహించకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ సికె.శ్రీనివాసులు, విఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రలో మదనపల్లె నాయకులు

మదనపల్లె, జనవరి 28 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారాలోకేష్ యువగళం పేరుతో కుప్పంలో చేపట్టిన పాదయాత్రలో మదనపల్లె టిడిపి నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, నియోజకవర్గ నాయకులు డిఆర్.తులసీప్రసాద్, శ్రీరామనేని జయరామ్‌నాయుడు, ఎస్ఎ.మస్తాన్‌లు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ మరింత పటిష్టం చెందుతుందన్నారు. 2024ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రెండు రోజులు పాటు జరిగిన పాదయాత్రకు విశేషస్పందన వస్తొందన్నారు.

## ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన మహిళ మృతి

మదనపల్లెక్రైం, జనవరి 28 ప్రభాతవార్త:



రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు నిమ్మనపల్లె మండలం సోమానుపల్లెకు చెందిన లేట్ నరసింహులు భార్య చిన్నపాపులమ్మ(40) ఒంటరి జీవితంపై విరక్తితో గురువారం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండేది. చికిత్సలు పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి మృతి చెందడంతో పిల్లలు అనాదలయ్యారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లోకేష్ పాదయాత్రలో రామసముద్రం నాయకులు

రామసముద్రం జనవరి 28 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారాలోకేష్ యువగళం పేరుతో కుప్పంలో చేపట్టిన పాదయాత్రలో రామసముద్రం మండల టిడిపి నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, శ్రీరామనేని జయరామ్‌నాయుడులు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ మరింత పటిష్టం చెందుతుందన్నారు. 2024ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రెండు రోజులు పాటు జరిగిన పాదయాత్రకు విశేషస్పందన వస్తొందన్నారు. తెలుగుదేశం పారీటని పటిష్టపరిచేందుకు కృషి చేస్తామని ఆహర్నిశలు కష్టపడుతామన్నారు. బయలుదేరి వెళ్ళినవారిలో మాజీ మండల అధ్యక్షులు క్రిష్ణంరాజు, మాజీ జడ్పిటిసి శివశంకర్, డాక్టర్ శివ, మురుగ, వెంకటరమణ, రెడ్డిశేఖర్, వాహీద్ తదితర నాయకులు కలరు.

## రామసముద్రం తహశీల్దార్‌గా దైవరాజన్

రామసముద్రం, జనవరి 28 ప్రభాతవార్త:



రామసముద్రం మండల తహశీల్దార్‌గా దైవరాజన్ శనివారం బాధ్యతలుచేపట్టారు. ఈయన విజయవాడలోని సీసీఎల్‌లో పనిచేస్తూ బదిలీపై రామసముద్రం మండల తహశీల్దార్‌గా వచ్చారు. ఇదివరలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ విశ్వేశ్వరశాస్త్రీ ఇదే కార్యాలయంలో డిటీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ దైవరాజన్ మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలను పరిష్కారంకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్థుల రక్షణ, ఒల్టాచట్టాలు, పట్టాదార పాసుపుస్తకాలు, విద్యార్థుల సర్టిఫికెట్ల తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరిస్తానని తెలిపారు.

## జలజీవన్ మిషన్‌పై బండ్లపై ప్రత్యేక సమావేశం

నిమ్మనపల్లె, జనవరి 28 ప్రభాతవార్త :



ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన నీరు అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపడుతున్న జలజీవన్ మిషన్‌పై పోర్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయితీలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిఈ సురేష్, ఏఈ హరి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శంకర్, ఎంపిపి నరసింహులు, వైఎస్ఆర్ పార్టీ మండల కన్వీనర్ రమణారెడ్డి, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, టీమ్‌లీడర్ రాధ, గ్రామ కార్యదర్శి మారప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో మిట్స్‌కు త్రిబుల్‌ఏ రేటింగ్ అవార్డు

కురబలకోట, జనవరి 28 ప్రభాతవార్త :



జాతీయ స్థాయిలో మిట్స్ కళాశాలకు త్రిబుల్‌ఏ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ హెనహన్సడ్ లెర్నింగ్ మరియు మిలియన్ ఇన్‌స్ట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ వారు స్వయం అనే పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ఆన్‌లైన్ పరీక్షల్లో విద్యార్థులకు అందించిన సర్టిఫికెట్స్ కోర్సుల ర్యాంకింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మిట్స్‌కు మొదటిర్యాంకు రాగా, దేశ వ్యాప్తంగా 6వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్ట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ మద్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఆరుణ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్‌లు అందుకొన్నారు. జులై–డిసెంబర్ 2022 సెషన్స్‌లో 3270రిజిష్టర్ చేసుకోగా ఇందులో 1349మంది ఎలైట్‌లోనూ 667మంది సిల్వర్, 19మంది గోల్డు, 98మంది సర్టిపికెట్లు సాధించారని తెలిపారు. ఈఘనత సాధించిన వారికి అద్యాపకులు, విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తి నాదేళ్ళ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీలక్ష్మి జనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలు

రామసముద్రం, జనవరి 28 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ రథసప్తమి వేడుకలు మొదలుకొని వచ్చేనెల 8వ తేది వరకు శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు కర్నాటక ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకొంటారు. ప్రతిరోజు ఇక్కడ స్వామివారికి భజనలు, నాటకాలు, కోలాటాలు నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పూజారి పార్థసారధి, కులశేఖర్, అనీల్‌స్వామి, తిన్నిలిస్వామి, మల్లికార్జున,శివాలు కోరారు. ప్రతిరోజూ జరిగే పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు.

## వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం

కేవి.పల్లె, జనవరి 28 ప్రభాతవార్తః



వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి లోకేష్ శనివారం తెలిపారు. అందిన రహస్య సమాచారం మేరకు మండల పరిధి బండవడ్డిపల్లె వద్ద వాహనాలు తనికీచేస్తుండగా అటుగా వచ్చిన ఏపీ29 సీబీ 6874 నెంబరు గల మహేంద్ర వాహనం అనుమానాస్పదంగా ఉండటంతో ఆపడానికి ప్రయత్నించామన్నారు. వారు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నామని తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా 60కేజీల బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని వాహనంతో సహా దుంగలు విలువ రూ.7లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన నిందితులు తమిళనాడు రాష్టానికి చెందిన తిరువణ్ణామలై జిల్లా పులియార్ గ్రామానికి చెందిన రామస్వామి తంగరాజు, కష్ణగిరి జిల్లా మంగునూరుకు చెందిన క్రిష్టమూర్తి మోహన్‌లను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఆయన తెలిపారు.

## ఫుడ్‌సైన్స్ కళాశాలలో నేడు వర్క్‌షాప్

పులివెందుల, జనవరి 28, ప్రభాతవార్త :

పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల, బెంగళూరు ఐఐపీఎం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆహా తయారీలో ఉన్న అవకాశాలపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీఎన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ తెలిపారు. పండ్లరసాల తయారీ, చిరుధాన్యాలతో విలువ జోడింపు, తదితర యంత్రాల వాకడంపై సదస్సు జరుగుతుందన్నారు.

## కలం అమరవీరులను స్మరించుకోవాలి

యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః




మిలటరీ తరహాలో సమాజ శ్రేయస్సు కోసం తమ అసువులు బాసిన కలం వీరులైన పాత్రికేయులను సైతం సమాజం సదాస్మరించుకోవాలని కడప యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర అనే అంశంపై పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన రెండు రోజులు జాతీయ సెమినార్ శనివారం ముగిసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికులు పోలీసులు దేశ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలు బలిచేస్తే సమాజంలోని రుగ్మతలు కుంభకోణాలు అసాంఘిక శక్తులను బహిర్గతం చేసి ప్రజలకు తెలియజేయాలన్న ఏకైక నిస్వార్థ సంకల్పంతో పనిచేస్తున్న అనేకమంది పాత్రికేయులు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. అంతర్జాతీయ నివేదికల ప్రకారం ప్రతి ఏడాది సుమారు 900 మంది పాత్రికేయులు ప్రాణాలు కోల్పోవడం గాని కనిపించకుండా పోవడం గానీ కనిపించకుండా పోవడం గాని జరుగుతోందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం వ్యక్తిగత శ్రేయస్సు వదిలి నిత్యం ఉరుకుల పరుగుల పాలకుల వేధింపులు అధికారుల ఈసడింపులు తోటివారి హేలననలకు గురవుతూ తమ లక్ష్యం నుంచి పక్కదారి పట్టకుండా నిబద్ధతతో పనిచేస్తున్న జర్నలిస్టులకు సమాజంలోని ప్రతి ఒక్కరు అండగా నిలబడాలన్నారు. అప్పుడే నిజమైన వార్తలు వెలుగులోకి వస్తాయన్నారు. తెలుగు అధ్యాపకులు నీరజ మాట్లాడుతూ సతీహితబోధ, హిందూ సుందరి, అనసూయ, సావిత్రిలాంటి స్త్రీల పేరుతో వచ్చిన తెలుగు పత్రికలు స్వాతం త్ర్య ఉద్యమంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా భాగస్వాము లు కావడానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ప్రాత్య పరిశోధన సంస్థ ఆచార్య బీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నాటి స్ఫూర్తిని నేటిపత్రికలు అనుసరించాలని కేవలం పార్టీలు సంస్థల పక్షం వహించాలని హితవు పలికారు. ప్రజాహితం కోసం పనిచేసే పత్రికలను అక్కున చేర్చుకోవడానికి నేటితరం పాటకు కూడా సిద్దంగా ఉన్నారన్న అంశాన్ని పత్రికల యాజమాన్యాలు గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు వాసు, ఈశ్వర్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, పరిశోధక విద్యార్తులు వేద కళాశాలల అధ్యాపకు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ల నిర్మాణంలో చరిత్ర సృష్టిద్దాం

– ఎంపీడీవో ఆనంద్‌కుమార్

తంబళ్లపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న లేఅవుట్లతో పాటు ఇల్ల నిర్మాణంలో అధికార యంత్రాంగం కష్టపడి పని చేసి చరిత్ర సృష్టిద్దామని ఎంపీడీవో ఆనంద్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని పరసతోపు, తంబళ్లపల్లె లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కారానికి అధికారులు ముందుండాలని హెచ్చరించారు. లేఅవుట్ల నిర్మాణంలో రహదారులు, విద్యుత్తు సౌకర్యం, నీటి సౌకర్యాలపై ఆరా తీసి ముందస్తు చర్యలు ఆయా శాఖల ఏఈలు హరినాథ్, అశోక్, శేషుబాబులను ప్రశంసించారు. లబ్ధిదారులు సైతం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మండల స్థాయి అధికారులు, పలు శాఖల ఏఈలు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

– వేలాదిగా వచ్చిన భక్తులు

తంబళ్లపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయంలో వెంకటరమణ స్వామి, శ్రీదేవి మరియు భూదేవీలతో అంగరంగ వైభవంగా టీటీడీ అధికారులు, వేలాది ప్రజల జయ జయ ద్వానాల మధ్య కల్యాణోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. కల్యాణ ఉత్సవానికి టీటీడీ నుంచి డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ ముని చెంగల్ రాయులు ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా టీటీడీ వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య వేలాది మంది భక్తులు వీక్షిస్తుండగా లక్ష్మీ కల్యాణం కార్యక్రమం టీటీడీ ప్రధాన అర్చకులు విశ్వనాథ బట్టర్ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి టీటీడీ మంగళ వాయిద్యాల మధ్య గోవింద మాలదారుల గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కోలాటాలు, భజనలు, కీర్తనలు, స్తోత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలను సభికులను ఆకట్టుకున్నాయి. కల్యాణోత్సవానికి హాజరైన వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తిరుపతి తిరుమల లడ్డు ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పిఎం కిసాన్‌కు వందశాతం ఈకేవైసి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

మదనపల్లె, జనవరి 28 ప్రభాతవార్త:



పిఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతుల వద్ద వంద శాతం ఈకేవైసి, పంటనమోదు కార్యక్రమాన్ని చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌బికే, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఆర్‌బికేలలో ఎరువుల అమ్మకం, వైఎస్ఆర్ యాప్ ద్వారా ఆర్‌బికే కార్యక్రమాలు నమోదు, పొలంబడి, ఇతర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్‌బికే సిబ్బంది తప్పనిసరిగా తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆర్‌బికేల ద్వారానే ఎరువుల అమ్మకాలను వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జవాబుదారితనాన్ని పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసే పథకాలు అర్హులైన రైతులందరికి అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిలు సువర్ణలక్ష్మి, ముజీబ్‌అహ్మద్, శివశంకర్, టెక్నికల్ ఏఓలు రమేష్‌రాజు, నాగేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాలంచెల్లిన బస్సులను తిప్పడం ఆపాలి

వేంపల్లె, జనవరి 28, ప్రభాతవార్త :

వేంపల్లె–రాయచోటి మార్గంలో నడుపుతున్న ఆర్టీసిక చెందిన కాలం చెల్లిన బస్సులను తిప్పడం ఆపాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ మార్గంలో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులను మోటారు వాహనాల చట్టం ప్రకారం అధికారులు ముమ్మర తనిఖీలు చేసి కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. వేంపల్లె–రాయచోటి మధ్య ప్రయాణమంటే ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుల సిబ్బంది కూడా తమ విదులను నిర్వర్తించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కాలం చెల్లిన బస్సులను తిప్పడం ఆపి కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పొలంబడిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ

బద్వేలు రూరల్, జనవరి 28 ప్రభాతవార్త :



మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి పొలంబడి ఉత్తమ యాజమాన్య పద్ధతుల శిక్షణ కార్యక్రమానికి బద్వేలు రెవిన్యూ అధికారి వెంకట రమణ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు రైతు భరోసా కేంద్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతు భరోసా కేంద్రం సహాయకులు, మండల వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రతి రైతు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పంటలు సాగు చేపట్టాలని, పర్యావరణ కాలుష్యం లేకుండా పెట్టుబడి వ్యవసాయం గణనీయంగా తగ్గించవచ్చని వ్యవసాయ వాణిజ్య దృక్పథంతో చేపట్టాలని, చిరు ధాన్యాల సాగు మరియు కూరగాయల సాగు చేపట్టాలని రైతులకు, స్థానిక వ్యవసాయ సిబ్బందికి, కార్యకర్తలకు పంట సాగుపై ప్రత్యేక అనుభవాలను గురించి సాంకేతిక సలహాలు, ప్రకృతి వ్యవసాయంపై సూచనలు, సలహాలు అందజేశారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు గోగుల రాధాకృష్ణయ్య సాగు చేసిన 15 రకాల దేశీ వరి రకాలను పరిశీలించారు. అలాగే గొడ్లవీటి సుబ్బారావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. బద్వేలు, గోపవరం, అట్లూరు, సిద్దవటం మండలాల వ్యవసాయాధికారులు చంద్రమోహన్ రెడ్డి, అరవింద నాయక్, రామకృష్ణయ్య, రమేష్ రెడ్డి, రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిరు ధాన్యాలపై అవగాహన సదస్సు

చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

– సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ

బద్వేలు రూరల్, జనవరి 28 ప్రభాతవార్త :




చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బోవిళ్ళవారిపల్లె గ్రామంలో చిరు ధాన్యాల సాగు మరియు వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ, వ్యవసాయ అధికారి బి.వి.సురేష్ రెడ్డి, వ్యవసాయ కమీషనర్ కార్యాలయ పరిశీలకులు మాట్లాడుతూ చిరు ధాన్యాలను ప్రోత్సహించడానికి భారతదేశం చొరవతో ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరు ధాన్యాలైన సజ్జ, రాగి, జొన్న, అరిక, కొర్ర, ఊదలు, వరిగ, సామ, అంటు కొర్రలు వాతావరణ స్థితిగతులకు అనుకూలమైన పంటలని తెలియజేశారు. చిరు ధాన్యాల పంటలకు తక్కువ నీరు, తక్కువ ఎరువులు వాడకం అవసరమవుతాయని, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కాబట్టి రైతులందరూ చిరు ధాన్యాల పంటలపై దృష్టి సారించాలన్నారు. రైతులు ఈ పంటలు సాగు చేయడంతో పాటు విరివిరిగా ఆహారంగా తీసుకోవాలని, రక్తపోటు, మధుమేహ వ్యాధి, మలబద్ధకం, క్యాన్సర్ నివారణకు దోహదపడుతాయని, రోగ నివారణ శక్తి గణనీయంగా పెరుగుతుందని, జొన్నలలో అత్యధికంగా 54 శాతం క్యాల్షియం ఉందని బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంటలు విస్తార పెంపుకు సూక్ష్మస్థాయి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఒక ఎకరాకు అవసరమైన సాగు నీటితో 5 ఎకరాల చిరు ధాన్యాలు సాగు చేయవచ్చని, మద్దతు ధర క్వింటాకు 2500 రూపాయలు ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని, చిరు ధాన్యాల సాగుకు అవసరమైన వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేయడం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, చిరు ధాన్యాలు క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, చిరు ధాన్యాలు సాగులో చీడపీడల బెడద తక్కువ అని, పిచ్చుకలు, అడవి పందుల నివారణకు చర్యలు చేపడితే పంట నష్టం తగ్గి లాభదాయకం అవుతుందని, అభ్యుదయ రైతులు భూమిరెడ్డి జయసుబ్బారెడ్డి, పద్మావతి, సూరం చిన్న వీరారెడ్డిలు తెలియజేశారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారులు కల్లూరు చంద్రమోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య, జడ్.బి.యస్.యఫ్, డివిజనల్ యాంకర్ నాగసుబ్బరాయుడు, వ్యవసాయ గ్రామ సహాయకులు పవన్, సాయి కిరణ్, మహతి, వెంకటేశ్వర్లు, బిందు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కండెక్టరు నిజాయితీ

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః

స్తానిక ఆర్టీసీ బస్టాండులో చరవాణి లభించడంతో బాధితునికి అప్పగించిన సంఘటన బస్టాండులో చోటుచేసుకుంది. వివరాలు కేవి.పల్లె మండలం దిగువ వగళ్ల గ్రామానికి చెందిన రామకష్ట శనివారం దిగువవగళ్ల నుంచి పీలేరుకు వస్తున్న క్రమంలో తన సెల్‌ఫోన్‌ను బస్టాండులో పోగొట్టుకున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కండెక్టరు ఆదినారాయణకు దొరికింది. సెల్‌ఫోన్ వివరాలు కనుగొని డీఎం బండ్లకుమార్ ఆధ్వర్యంలో బాధితునికి సెల్‌ఫోన్ అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్టాండు మేనేజరు రెడ్డెప్ప, కంట్రోలర్ సుబ్బరామయ్య, బుక్‌స్టాల్ వెంకటరమణ పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః



పీలేరు గ్రామ పంచామయతీ డంపింగ్ యార్డుకు స్థలాన్ని సర్పంచి హబీబ్ బాషా, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్‌లు పరిశీలంచారు. శనివారం మండలంలోని ముదుపులవేముల పంచాయతీ సర్వే నెంబరు 511లో 10 ఎకరాలస్థలాన్ని రెవెన్యూ అధికారులుతో కలిసి సర్వే నిర్వహించి స్థలానికి హద్దులు గుర్తించారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి డంపింగ్‌యార్డు స్థలం లేక సమస్యగా ఉండడంతో ఈవిషయంపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దష్టికి తీసుకెళ్లగా వారి ఆదేశాల మేరకు కలెక్టర్ పీఎస్.గిరీషా స్థలాన్ని కేటాయించారు. ఈస్థలానికి చుట్టు ప్రహరీ నిర్వహించి స్థలాన్ని చదునుచేసేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్వేయర్ రామాంజులు, నాయకులు మగ్బుల్, మునీర్, హబీబ్, పంచాతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తపాల సేవలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః



తపాలాశాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి తపాలాశాఖ ఎస్ఎస్‌పీ జాఫర్ సాదిక్ అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీసు కార్యాలయం నందు ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక్‌దిన్‌ఏక్ క్రో (ఒక్కరోజులో ఒక కోటి) ఖాతాలు దేశ వ్యాప్త కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పీలేరులో డివిజన్‌లో 1700 ఖాతాలు, వాల్మీకిపురంలో 1500 ఖాతాలు నమోదు చేసినట్లు తెలిపారు. నేడు(ఆదివారం) కూడా ఈకార్యక్రమం ఉంటుందని తెలిపారు. సుకన్య సమద్ది యోజన పథకం మీచిన్నారి తల్లుల బంగారు భవితకు కొండంత భరోసా ఉంటుందని తెలిపారు. ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పోస్టుమాస్టర్ శేషాద్రి, విజయభాస్కర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతావారోత్సవాలు

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః



స్తానిక ఆర్టీసీ గ్యారేజీ నందు రోడ్డు భద్రతా వారోత్సవాలు శనివారం నిర్వహించారు. అందులో భాగంగా శనివారం డిపో మేనేజరు బండ్ల కుమార్ అధ క్షతన గ్యారేజీలో ఏర్పాటు చేసిన సమావేశానికి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఇబ్రహీం విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ సిబ్బం ది, సూపర్‌వైజర్లు ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవింగ్ మరియు మెయింటెనెన్సు సిబ్బందిని ఉద్దేశించిన స్టీరింగ్ బ్రేకులు మంచి కండీషన్‌లో ఉంచాలన్నారు. బస్సులో ఏవైనా మరమ్మతులు ఉంటే గ్యారేజీలోనే మరమ్మతులుచేసి ఇవ్వాల న్నారు. ప్రమాదాల నివారణకు మెకానికల్ పాత్రకూడా ఉందన్నారు. ఇంధనపొ దుపు కూడా సిబ్బంది బాధ్యతగా గుర్తించుకోవాలన్నారు. ఇంధన పొదుపు వల్ల డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజరు బండ్లకుమార్, గ్యారేజీ సూపర్‌వైజర్ హబీబుల్లా, రసూల్, స్టోర్ ఇన్‌చార్జి ఆవుల బాలసుబ్రమ ణ్యం,అసోసియేషన్

## నాగభూషణం కళాశాలలో రథ సప్తమి వేడుకలు

బద్వేలు, జనవరి 28 ప్రభాతవార్త :



రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో వసంత పంచమి రథ సప్తమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సరస్వతీ దేవి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో వేద పండితులు పాల్గొని సరస్వతీ దేవి శ్లోకాలు, అష్టోత్తరాలు, శతనామవళితో చదువుల తల్లికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కళాశాల ఏవో, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ సాయికృష్ణ మాట్లాడుతూ మాఘ మాసం శుద్ధ పంచమి రోజున వచ్చే వసంత పంచమి పర్వదినం చాలా విశిష్టమైనదన్నారు. ఈ సంవత్సరం వసంత పంచమి వేడుకలు కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించి చదువుల తల్లికి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యాభ్యాస పయనంలో విద్యా తల్లి కరుణ కటాక్షాలతో జ్ఞానాన్ని పొంది భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వాదంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు చలపతి, అధ్యాపక బృందం లక్ష్మీదేవి, మౌనిక, రాధ, సుధాకర్ రెడ్డి, వీరేంద్ర, నరేష్, అశోక్, జయపాల్, నరసింహులు, సుబ్రమణ్యం తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒబెరాయ్ హోటల్ బృందం గండికోట సందర్శన

జమ్మలమడుగు, జనవరి 28, ప్రభాతవార్త:



ఒబేరాయ్ హోటల్స్ బృందం వారు శనివారం గండికోట చేరుకొని పెన్నానది లోయ, గండికోట పరిసరాలను పరిశీలించి తదుపరి గండికోటకు 2 కి.మీ దూరంలో ఇసుకతోట వద్ద ప్రభుత్వం స్థలం 400 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అందులో ఒబెరాయ్ హోటల్ యాజమాన్యానికి 50 ఎకరాలు రెవెన్యూ వారు కేటాయిస్తున్నట్లు సమాచారం. సాయంత్రం 4.10 గంటలకు గండికోట నుంచి బయలుదేరి కడపకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో విక్రంజిత్‌సింగ్ ఒబెరాయ్, శంకర్, కల్లూల్ కుందు, ఎంఎల్ రెడ్డి, మహిమా సింగ్ ఠాకూర్, అలాగే జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐ సదాశివయ్య, గండికోట సర్పంచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు అంత్యక్రియలు

రాజంపేట అర్బన్, జనవరి 28 ప్రభాతవార్త



రాజంపేట పట్టణం గడ్డివీధిలో అనారోగ్యంతో మృతిచెందిన ఓ గోమాతకు గోసేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం లేగదూడ చనిపోయిన విషయాన్ని తెలుసుకొన్న గోసేవా సమితి సభ్యులు, బిజెపి నేత పోతుగుంట నాగేశ్వరనాయుడు సహకారంతో హిందు సంప్రదాయం ప్రకారం మృతిచెందిన గోవుకు పూజలు నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, చెరుకుపల్లి చంద్రమౌళి, ఆకూరి శివ, ఆకూరి రాజా, పిడుగు శ్రీను, ముక్కటి బాలాజీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయి చైతన్య విద్యార్థులను అభినందించిన జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి

### చేతివ్రాత పోటీల్లో సాయి చైతన్య విద్యార్థు ప్రతిభ

బద్వేలు అర్బన్, జనవరి 28 ప్రభాతవార్త :



జిల్లాస్థాయి చేతివ్రాత పోటీలలో బద్వేలు సాయి చైతన్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శ్రీజన్య మూడవ బహుమతి, 7వ తరగతి చదువుతున్న నూకంరెడ్డి భవిష్యా రెడ్డి ప్రథమ బహుమతిని శనివారం పోరుమామిళ్ళలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ పంగా సౌజన్య లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా సాయి చైతన్య కరస్పాండెంట్ పంగా సౌజన్య లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చేతివ్రాత పరీక్షల్లో కూడా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచడం ఎంతో సంతోషకరం అన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని, అందులో భాగంగా చేతివ్రాత పరీక్షలో తమ విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించడం ఎంతో అభినందనీయం అన్నారు.

## విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

నందలూరు, జనవరి 28 ప్రభాతవార్త



నందలూరు మండలంలోని స్వర్ణాంధ్రమదర్‌ల్యాండ్ విక్టరి స్కౌట్‌గ్రూప్ 24వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సైన్స్‌ఫేర్ కార్యక్రమాలను వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి మాజీ సర్పంచ్ భూమన శివశంకర్‌రెడ్డి మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్రమదర్‌ల్యాండ్ స్కౌట్‌గ్రూపు గత 24 సంవత్సరాల నుంచి విద్యార్థులకు అనేక రకాల క్రీడలు, విద్యకు సంబంధించిన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిరవధికంగా జరిపిస్తున్న సంస్థ జిల్లాలోనే ఈ సంస్థేనని ఆయన కొనియాడారు. అలాగే విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలని, క్రీడలు, చదువులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం అలవడుతుందని దాని ద్వారా పైచదువులకు వెళ్లినప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు కంభం జితేంద్ర, ఎస్.రౌఫ్‌బాషా, మోహన్, శ్రీసాయిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ సభ్యులు భరత్‌కుమార్, రవికుమార్, జశ్వంత్, సాయి, అరుణ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం

నందలూరు, జనవరి 28 ప్రభాతవార్త




నందలూరు మండలంలోని లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అరవపల్లె ఆర్ అండ్ బి బంగ్లా వద్ద శనివారం పేదలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయభాస్కర్‌రావు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవాసంస్థల ద్వారా పేదలకు సేవలందించడం హర్షణీయమన్నారు. లయన్స్‌క్లబ్ రీజనల్ కోఆర్డినేటర్ స్పెషల్ పోలీసు ఎస్ఐ మన్యం రామ్మోహన్‌కుమారుడు మన్యం చరణ్ జన్మదినం సందర్భంగా వేడుకలను పేదల మధ్య జరుపుకొని వారికి అల్పాహారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ కుర్రామణి, వాకర్స్‌క్లబ్ సెక్రటరి మోడపోతల రాము, సభ్యులు గాడి సునీల్‌రెడ్డి, చామంచి పెంచలయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు చొరవ చూపాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవో సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేలా పని చేయాలని ఆయన శాఖల వారీగా అధికారులతో రివ్యూ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లించేలా చూడాలని ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. ఈ క్రాప్ చేయించుకున్న పంట నష్టపరిహారం అందుతుందని వ్యవసాయాధికారి నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు 2.50 ఎకరాలు భూమిని కేటాయించాలని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపడుతుందని మండలానికి ఇప్పటి వరకు 376 మందికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని సమ్మత్‌ఖాన్ తెలిపారు. ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేసుకోవాలని డా.సిద్దయ్య పేర్కొన్నారు. అలాగే వెటర్నరీ అధికారి మాధవరెడ్డి రైతులు తమ పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిఎపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, పీఆర్ఏఈ సుబ్రమణ్యం, ఉద్యానశాఖాధికారిని నాగమణి, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణయ్య, హౌసింగ్ ఏఈ జనార్ధన్, ఏపీఎం నిరజంన్, పంచాయతీ కార్యదర్శులు, శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ-జరిమానా విధింపు

దువ్వూరు, జనవరి 28, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే రహదారిలో మురళీనగర్ మిట్ట వద్ద శనివారం ఎస్సై రాఘవేంద్రరెడ్డి వివిధ వాహనాలు తనిఖీ చేసి రికార్డులు సరిగా లేని వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు చెందిన రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించామన్నారు.

## వేంపల్లెలో ఘనంగా శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

వేంపల్లె, జనవరి 28, ప్రభాతవార్త :



వేంపల్లెలో రథసప్తమి సందర్భంగా పాపఘ్ని నదిఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు అచ్యుత నారాయణాచార్యులు నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో శ్రీధర్, ఛైర్మన్ కురాకుల వెంకటేష్‌లు తెలిపారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయంలో మహిళలు పాటలు పాడి భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తుల సహకారంతో పట్టణ పురవీధులలో మేళ, తాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే మెయిన్‌బజార్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో ఆంజనేయస్వామికి, కొండపై వెలసిన ఎద్దుల కొండ్రాయుడు స్వామికి విశేష పూజలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు అరవింద్, బాలాజీ, శ్రీను, నరజా జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కొండయ్య, దాసిరెడ్డి, లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువగలంలో పాల్గొన్న పంతగాని, బొక్కసం సునీల్

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28 ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగుదేశంపార్టీ నాయకత్వ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగలం ఆధ్వర్యంలో పాదయాత్రలో రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీకి చెందిన పంతగాని నరసింహప్రసాద్, బొక్కసం సునీల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగలం ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు మరువరానివని, ముఖ్యంగా తెలుగుదేశంపార్టీకి చెందిన అభిమానులు చూపిస్తున్న ఆదరణ, అభిమానం మరువరానిదని, అదేవిధంగా భారీ జనసమీకరణతో వస్తున్న ప్రజాధరణతో వైసిపి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, రానున్నది తెలుగుదేశంపార్టీ పరిపాలనేనని వారు అన్నారు. దాదాపు కొన్ని గంటల పాటు నారా లోకేష్‌తో పాదయాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా ఆయన పాదయాత్రకు సంఘీభావం ఎప్పుడూ ఉంటుందని పంతగాని నరసింహప్రసాద్, బొక్కసం సునీల్‌లు అన్నారు.

## మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన సదస్సు

### సివిల్ కోర్టు జడ్జి అంజనప్రియదర్శిని

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సివిల్ కోర్టు జడ్జి అంజనా ప్రియదర్శిని ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై విద్యార్థుల్లో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, బాల్యదశలో చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకు ఈ అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని వారు అన్నారు. ముఖ్యంగా ఈ మాధ్యమిక వయస్సు నందు విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికాకుండా ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అద్దెపల్లె వెంకట్రామరాజు, షిర్డీసాయి కాలేజి అధినేత ముత్యాల పెంచలయ్య, న్యాయవాదులు శంకరయ్య, సురేష్‌తో పాటు కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు ప్రశంసాపత్రం

పీలేరు, జనవరి 28 ప్రభాతవార్తః



74వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్ చేతులు మీదుగా దయాసాగర్ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చరవాణిలో మాట్లాడుతూ ఈఅవార్డులు రావడం వల్ల ఉద్యోగ రీత్యా మరింత బాధ్యతలు పెరుగుతాయన్నారు. తనతో పాటు ఈప్రశంసాపత్రాను డిపో సబ్ ఇన్స్ పెక్టర్ హరికష్ణ, డిపో హెడ్‌కానిస్టేబుల్ నాగరాజులు కూడా ఎక్సైజ్ కమిషనర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు ఆయన తెలిపారు.

## సప్త వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు

### రథ సప్తమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

బద్వేలు అర్బన్, జనవరి 28 ప్రభాతవార్త :



రథ సప్తమిని పురస్కరించుకొని నెల్లూరు రోడ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం దేవాదాయ శాఖ ఈవో శివయ్య, ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ వెంకటరామిరెడ్డి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునే శ్రీవారికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనం, శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, చంద్రప్రభ వాహనాలపై గుడి ఉత్సవం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే పట్టణ, పరిసర ప్రాంత భక్తాదులందరూ స్వామివారిని దర్శించుకొని, కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తాదులకు దేవాదాయ శాఖ మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రత్యేక ప్రసాదాలతో పాటు మధ్యాహ్నం పలువురికి అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్య, కొండయ్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు వర్దిరెడ్డి శివారెడ్డి, చిన్ని చెంచురత్నం, రమణమ్మ, మహేశ్వరి, అరుణమ్మ, సుజాత, జయరామిరెడ్డి, చిందుకూరి శంకరయ్యతో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ :

రథ సప్తమిని పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, సతీమణి తులశమ్మ కుటుంబ సభ్యులతో పాటు, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, సతీమణి మమత కుటుంబ సభ్యులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ కల్లూరు రాజేశ్వరి, మాజీ వైస్ ఛైర్మెన్ కల్లూరు రమణారెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు స్వామివారిని దర్శించుకొని హనుమంత వాహనంపై స్వామివారి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. వారికి దేవాదాయ శాఖ ఈవో శివయ్య, ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ వెంకటరామిరెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు పంగా చెన్నకృష్ణారెడ్డి, రాగిమాను ప్రతాప్ కుమార్, దుద్దుకూరు సత్యనారాయణ, కుప్పాల రమణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఆవుల శ్రీనివాసులు, రిటైర్డ్ ఆర్ అండ్ బి డిఈ పాలకొండు రామకృష్ణారెడ్డి, పొన్నవోలు సాంబశివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

### లక్ష్మీపాలెంలో వైభవంగా శ్రీవారికి విశేష పూజలు :

బద్వేలు మండల పరిధిలోని లక్ష్మీపాలెంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో రథ సప్తమిని పురస్కరించుకొని ఈవో శివయ్య, ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ మెంటా అశోక్ కుమార్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు వాహనాలపై మాడ వీధులలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు స్వామివారికి కాయా కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు.

## పోలీస్ పెరేడ్ మైదానం నందు సాయుధ దళానికి వార్షిక మొబలైజేషన్ కార్యక్రమం

### -జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి.జనవరి28 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద అత్యవసర సమయంలో ఎఆర్ విభాగం విశేష స్పందనను కనబరుస్తూ, ప్రజలకు సేవ చేస్తూనే ఉంది. సిబ్బంది ఎంతో క్రమశిక్షణతో విధులను నిర్వహిస్తున్నారు. ఇదే క్రమశిక్షణను ఇలాగే కాపాడుకుంటే ప్రజల మన్ననలు పొందాలని అన్నమయ్యజిలా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభిలాషించారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక నైపుణ్యంలో నిష్ణాతులు అయి ఉంటారు. వాటికి గుర్తింపును పొందడానికి ఈ మొబలైజేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. విధులలో నైపుణ్యం శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరుచుకుని విధులను సమర్ధవంతంగా నిర్వర్తించడానికి ఇదొక చక్కటి అవకాశమన్నారు. ఈ 15 రోజులు రిప్రెస్మెంట్ కార్యక్రమంలో అధికారులు మాబ్ కంట్రోల్, ఫైరింగ్, డ్రిల్ ప్రముఖలు బందోబస్తు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎఆర్ విభాగంలోని అధికారులకు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ సమక్షంలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. సిబ్బంది అందరు విధులతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకొనుటకుగాను సిబ్బంది వ్యాయామం చేయడం అలవరుచుకోవాలని సూచించారు.

## రూ.60 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

### ప్రారంభించిన ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి

బద్వేలు రూరల్, జనవరి 28 ప్రభాతవార్త :



మండల పరిధిలోని అనంతరాజపురం (లక్ష్మీపాలెం) గ్రామంలో శనివారం రూ.60 లక్షలు ప్రత్యేక నిధులతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. గత కొంత కాలం క్రితం జిల్లా కలెక్టర్ అనంతరాజపురం గ్రామానికి చేరుకొని అక్కడ ఉన్న పరిస్థితుల దృష్ట్యా డ్రైనేజీతో పాటు పలు కార్యక్రమాలపై విచారణ చేపట్టి వెళ్ళిన అనంతరం శనివారం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి డ్రైనేజీ పనులతో పాటు గ్రామ అభివృద్ధికి శంఖుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన అనతి కాలంలోనే గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని, రోడ్లు, డ్రైనేజీ మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బద్వేలు నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు, సెంచరీ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణయ్యతో పాటు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మెన్ కల్లూరు రమణారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బిజివేముల రామసుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు వైస ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి, సింగసాని శివయ్య, బోడపాడు రామసుబ్బారెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుప్పాల వెంకటరమణ, మాచయ్య, ప్రసాద్, చెన్నయ్య, బిజ్జం రమణ, శ్రీరాములు, మల్లేశ్వర్‌రెడ్డి, సింగసాని రాజేష్, సాయి సంజీవ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, డిఈలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ మెంబర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రథసప్తమి వేడుకలు

### తెల్లవారుజాము నుండే స్వామివారిని దర్శించుకున్న భక్తులు

### ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంవిఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్, జనవరి 28 ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం రథ సప్తమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుండే ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు పలు రకాల విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య భగవానుడు జన్మ దినోత్సవమును రథ సప్తమిగా జరుపుకోవడం వలన శ్రీవారి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తాదులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ మరియు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, రామకృష్ణ మెడికల్ స్టోర్ నిర్వాహకులు కుప్పం సుధాకర్, సతీమణి దాక్షాయణిదేవి కుటుంబ సభ్యుల సహాయంతో భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారిని ప్రముఖ వ్యాపారవేత్త యాదాళ్ళ కృష్ణమూర్తి, ఆడిటర్ గండికోట శివ కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పత్తి కృష్ణ కుమార్, సముద్రాల రాజేంద్ర ప్రసాద్, అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

### స్వామివారిని దర్శించుకున్న ఎంవిఐ శేఖర్‌రావు కుటుంబ సభ్యులు :

రథ సప్తమి వేడుకలను పురస్కరించుకొని శనివారం సిద్దవటం రోడ్‌లో వెలసి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు, సతీమణి భవాని కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛరణలతో వారిని ఆశీర్వదించారు. తదనంతరం స్వామివారి సన్నిధిలో శాలువా, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు విద్యార్థిని ఎంపిక

ఓబులవారిపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు విద్యార్థి సుచరిత ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓబులవారిపల్లె జిల్లా ప్రాథమికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైందని హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. ఉపాధ్యాయుడు రామలింగయ్య గైడ్‌గా వ్యవహరించి పిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు అన్ని విధాలా పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు బాలికకు ఎన్నో మెళకువలు నేర్పించి జిల్లా సైన్స్ ఫేర్‌లో పాల్గొనేందుకు సహకరించారన్నారు. ఈ పోటీలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన సాఫ్ట్‌వేర్, యాడ్స్ విభాగానికి గాను రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో జరిగే పోటీకి ఎం.సుచరిత హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు రామలింగయ్య రాజు మాట్లాడుతూ సుచరిత పోటీకి ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ కంట్రోలింగ్ సిస్టంను చేసి యాప్ ద్వారా కంట్రోల్ విధానాన్ని చక్కగా ప్రదర్శించి డ్యూలీ మెంబర్స్ జడ్జీ ప్రశంసలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసంతో రూ.43వేలు మాయం

### నివ్వెరపోయిన బాధితుడు..!!

### ఒటిపి, పిన్ నంబరు రాలేదు, అయినా డబ్బులు మాయం

### తస్మాస్ జాగ్రత్త అంటున్న నిపుణులు

చిట్వేలి, జనవరి 28 ప్రభాతవార్త

చిట్వేలి గ్రామ నివాసి ఆన్‌లైన్‌లో జరిగిన మోసంతో 43 వేల నగదు పోగొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే స్థానికంగా శ్రీ సాయి జూనియర్, డిగ్రీ కళాశాల నడుపుతున్న కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి 10 కరోజుల క్రితం ఆన్‌లైన్‌లో 'ఎయిర్ టెక్' టివి కొనుగోలు చేయడం జరిగింది. కాగా కొన్న టివి నాలుగు రోజుల నుంచి పనిచేయకపోవడంతో సంబంధిత కంపెని వారికి ఫోన్ చేయగా 'క్విక్ సపోర్ట్ యాప్'ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని మీ పూర్తి వివరాలను అందులో పొందుపరిస్తే మా కంపెని మెకానిక్ మీ ఇంటివద్దకు వచ్చి రిపేరు చేస్తారని సదరు కంపెనివారు తెలిపారన్నారు. మరుసటి రోజు ఉదయం తన అకౌంట్ వివరాలు పరిశీలిస్తే 43 వేల రూపాయలు మాయమైనట్లు తాను తెలిపారు. ఎలాంటి ఒటిపి కానీ, పిన్‌కోడ్ కాని రాలేదని కానీ ఇది ఎలా జరిగిందో తెలియడం లేదని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాను కోరారు. కాగా జరిగిన తీరును 1930 సైబర్‌క్రైమ్ నెంబర్‌కి ఫోన్‌చేసి కంప్లైంట్ రిజిస్టర్ చేసినట్లు తాను తెలిపారు. ప్రతిఒక్కరికి మొబైల్ జీవితంలో ఒక భాగం అయ్యిందని, బాగా చదువుకున్నవారు ఇట్టి మోసాలకు గురవుతున్న తరుణంలో అంతగా మొబైల్‌పై అనుభవం లేనివారు, చదువుకోనివారు ప్రతిఒక్కరు మోసపూరిత యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దని, తెలియని నంబర్ల నుంచి ఫోన్ చేసి వివరాలు అడిగితే తెలపవద్దని ఏదైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని చిట్వేలి ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు.

## విద్యా బోధనలో పని ఒత్తిడి తొలగించండి

### – ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 28, ప్రభాతవార్త:



అధ్యాపకులు ఉపాధ్యాయులకు విద్యా బోధనలో పని ఒత్తిడి లేని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఓబులవారిపల్లె మండలం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో శనివారం ఆయన సందర్శించి అధ్యాపకుల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ హాజరు తదితర యాప్‌ల వద్ద విలువైన సమయం వాటికే సరిపోతోందని వాటి వల్ల ఒక వైపు ఉపాధ్యాయులకు పని ఒత్తిడి పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా విద్యా బోధనలో ఆటంకాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజు, అధ్యాపకులు జానీ, జనార్ధన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, మధు, ఓబులేసు పాల్గొన్నారు.

## నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్, జనవరి 28, ప్రభాతవార్త :

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. పట్టణానికి చెందిన కోలా ప్రసాద్ సౌజన్యంతో ఎస్‌కె డ్యాన్స్ స్టూడియో చిన్నారులచే డ్యాన్సు ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు.

## కోదండరామాలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు

ఒంటిమిట్ట జనవరి28ప్రభాతవార్త:

స్థానిక కోదండరామాలయంలో శనివారం రథ సప్తమి వేడుకులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే మూలవిరాట్‌లకు ఆభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఆలకరించారు. తరువాత గ్రామెత్సవం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచి భక్తులువిచ్చేసి కోదండరామున్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్చకులు వీణరాఘవాచార్యులు. మనోజ్‌కుమార్,సిబ్బంది ప్రవీణకుమార్‌రెడ్డి, ఆదికారులు పాల్గొన్నారు.